

వెంకన్న సేవలో కీర్తి

సినీ కథానాయిక కీర్తి సురేష్ శుక్రవారం ఉదయం తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వచ్చే నెలలో పెళ్లాడనున్న నేపథ్యంలో స్వామివారి ఆశీస్సుల కోసం వచ్చానని చెప్పారు.



చికిత్స పొందుతున్న హర్షిత్‌సాయి



రక్తదానం చేసిన మెడికోలు

ప్రాణదాతలు

- చిత్తూరు అపోలో వైద్య కళాశాల విద్యార్థుల ఔదార్యం
- బ్లడ్ క్యాన్సర్ బాధితుడి ప్రాణం కాపాడేందుకు 22 మంది రక్తదానం

చిత్తూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైద్యుల్ని ప్రాణదాతలంటారు.భవిష్యత్తులో వైద్యులు కాబోయే ఎంబీబీఎస్ విద్యార్థులు ఆ మాటల్ని నిజం చేసి చూపించారు. బ్లడ్ క్యాన్సర్‌తో బాధ పడుతున్న ఓ బాలుడి ప్రాణాన్ని కాపాడడంలో ప్రధాన పాత్ర పోషించారు. చిత్తూరు అపోలో వైద్య కళాశాల విద్యార్థులు ఏకంగా 22 మంది ఒకేసారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. నెల్లూరు నగరానికి చెందిన నీతా, హరిబాబు దంపతులకు ఓ కుమారుడు, ఓ కుమార్తె. కుమారుడు తిరుమలశెట్టి హర్షిత్‌సాయి ఇటీవల పదవ తరగతి పూర్తి చేసుకుని డిప్లొమాలో చేరాడు. వారం రోజుల కిందట కళ్లు తిరిగి పడిపోయాడు. తొలుత ప్లేట్‌లెట్స్ కౌంట్ తక్కువగా ఉందని రక్త పరీక్షలు చేస్తే బ్లడ్ క్యాన్సర్ బయటపడింది. మొదట తిరుపతిలో చేర్పించి, ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ కనీసం 30 యూనిట్ల రక్తం, ప్లేట్‌లెట్స్ కావాలని చెప్పారు. హార్డ్‌వేర్ షాపులో గుమాస్తా పని చేసే తండ్రికి, ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పని చేసే తల్లికి కాళ్లూచేతులు ఆడలేదు. తమ దీన పరిస్థితి వివరిస్తూ సామాజిక మాధ్యమాల్లో మెసేజీ పెట్టి రక్తం కోసం అభ్యర్థించారు. ఇద్దరు కుటుంబ సభ్యులు, ముగ్గురు బయటి వ్యక్తులు ముందుకొచ్చి ఐదు యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. కొందరు వారి ఆపదను అదునుగా చేసుకుని 'నేను బస్సులో బయల్దేరాను. రూ.500 ఫోన్ పే చేయండి' అని అడిగి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. ఆ తర్వాత సెల్‌ఫోన్లు ఆఫ్ చేసుకున్నారు. కుటుంబ సభ్యులు వేలూరులో విచారిస్తే, ఒక్కో యూనిట్ రక్తానికి రూ.5 వేలు ఇస్తే ఏర్పాటు చేస్తామని ఆటోవాలాలు చెప్పారు. ఇలాంటి సమయంలో సామాజిక మాధ్యమాల ద్వారా విషయం తెలుసుకున్న చిత్తూరులోని అపోలో వైద్యకళాశాలలో సెకండియర్ చదువుతున్న ఫణి, ఫైనల్ ఇయర్ స్టూడెంట్ శివశంకర్ కలిసి తోటి విద్యార్థులతో చర్చించారు. సెకండియర్ నుంచి 13 మంది, ఫైనలియర్ నుంచి 9 మంది.. మొత్తం 22మంది విద్యార్థులు ఏకమయ్యారు. శుక్రవారం కాలేజీ నుంచి సుమారు 40 కిలోమీటర్ల దూరంలోని వేలూరు సీఎంసీ ఆస్పత్రికి వెళ్లారు. 22 యూనిట్ల రక్తాన్ని దానం చేసి హర్షిత్‌సాయి ప్రాణాలు నిలిపేందుకు తమ వంతు ప్రయత్నం చేశారు. ఒక్కసారిగా 22మంది విద్యార్థులు రక్తదానానికి ముందుకు రావడంతో సీఎంసీ వైద్యులు, సిబ్బంది ఆశ్చర్యపోయారు.రక్తదానం చేసేందుకు ఏర్పాట్లు చేశారు.రక్తదానం చేసిన ఫణి, చంద్రతేజ, శివ, చక్రధర్, సౌరభ్, మరోజ్, సమయ్,నితిన్, దిలీప్‌కుమార్, డోలా కృష్ణ, సోమనాథ్, భానుతేజ్, నిరంజన్, ఉజ్వల్, సూర్యతేజ, యేసు ప్రసాద్, శివశంకర్, ఖలీల్, సూరజ్, జెఫ్రీలను అభినందించారు.

నేడు పెన్షన్ల పంపిణీ

చిత్తూరు సెంట్రల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను శనివారం లబ్ధిదారులకు అందజేసేందుకు డీఆర్‌డీఏ అధికారులు సిద్ధమయ్యారు. డిసెంబరు 1వ తేదీ ఆదివారం సెలవు దినం రావడంతో పింఛన్లకు ఇబ్బంది లేకుండా ఒక్క రోజే ముందే పింఛన్లు అందజేయనున్నారు. జిల్లాలోని 2,67,936 మందికి పింఛన్లు అందజేసేందుకు రూ.113.31 కోట్లు అధికారులు ఇప్పటికే విడుదల చేశారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పింఛన్లు అందజేయనున్నారు.

సర్పంచ్‌ల గౌరవ వేతనం విడుదల

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఆగస్టు నుంచి నవంబరు వరకు సర్పంచ్‌ల గౌరవవేతనాన్ని ప్రభుత్వం విడుదల చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి కె.సుధాకర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 697 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 12 చోట్ల ఎన్నికలు జరగలేదు. మిగిలిన 685 పంచాయతీల సర్పంచ్‌లకు నెలకు రూ.3వేల వంతున రూ.1,16,72,000 విడుదలైనట్లు పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని సర్పంచ్‌ల బ్యాంకు ఖాతాలకు త్వరలో జమచేస్తామన్నారు.

టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్

చిత్తూరు సెంట్రల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): టెన్త్ పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రత్యేక ప్రణాళికను రూపొందించి స్టడీ అవర్స్ నిర్ణయించారు. స్టడీ అవర్స్‌లో కచ్చితంగా చదివించేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆయన శుక్రవారంఆదేశించారు. రోజూ ఉదయం 7.45 గంటల నుంచి 8.45 గంటల వరకు, సాయంత్రం 4.15 గంటల నుంచి 5.15 వరకు ఈ స్టడీ అవర్స్‌ను నిర్వహించేలా నిర్ణయించారు. సోమవారం ఉదయం, సాయంత్రం తెలుగు, బయాలజీ, మంగళవారం ఫిజిక్స్, ఇంగ్లీష్, బుధవారం ఇంగ్లీష్, మ్యాథ్స్, గురువారం మ్యాథ్స్, సోషియల్, శుక్రవారం సోషియల్, హిందీ, శనివారం హిందీ, తెలుగు స్టడీ అవర్స్ సబ్జెక్టులుగా నిర్ణయించారు.

చౌకదుకాణాలకు రేషన్ సరుకులు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 5,43,202 రేషన్ కార్డులకు సంబంధించి డిసెంబరు నెల రేషన్‌కోటాను ప్రభుత్వం విడుదల చేసినట్లు సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ బాలకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కార్డుదారులకు పంపిణీ చేసేందుకు కందిపప్పు 543 టన్నులు కావాల్సివుండగా ప్రభుత్వం వెయ్యి టన్నులు సరఫరా చేసిందని చెప్పారు. అరకిలో చొప్పున పంచదార పంపిణీకోసం 291 టన్నులు జిల్లాకు చేరగా, కార్డుదారులందరికీ ఉచితంగా పంపిణీ చేసేందుకు 9030 టన్నుల బియ్యం అందిందని తెలిపారు. బియ్యంతో పాటు రెండు లేదా మూడు కిలోల చొప్పున జొన్నలు పంపిణీ చేసేందుకు 271 టన్నుల జొన్నలు జిల్లాకు చేరాయని చెప్పారు. జిల్లాలోని 14 ఎం.ఎల్. పాయింట్ల నుంచి ఎఫ్‌పీ షాపులకు సరఫరా చేయడం జరిగిందని, డిసెంబరు 1 నుండి కార్డుదారులకు ఎఫ్‌పీ షాపుల నుంచి ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారులకు రేషన్ సరఫరా చేస్తామని చెప్పారు.

సారా రహితం సాధ్యమేనా?



చిత్తూరు సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో విపరీతంగా పెరిగిన సారా తయారీ, అమ్మకాలు తగ్గుముఖం పట్టడం లేదు. కరోనా లాక్‌డౌన్ పీరియడ్‌లో మద్యం దుకాణాలు మూతపడడంతో సారా తయారీ బాగా పెరిగింది.తమిళనాడు, కర్ణాటక సరిహద్దు మండలాలైన పుంగనూరు, కుప్పం, జీడీనెల్లూరు, నగరి నియోజకవర్గాలతో పాటు గుడిపాల మండలంలో పెద్దఎత్తున సారా తయారు చేస్తున్నారు.మద్యపాన నిషేధం అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన వైసీపీ ఆ దిశగా కనీస ప్రయత్నాలు చేయలేదు.మద్యం రేట్లు విపరీతంగా పెంచేయడంతో సారా తయారీ జోరందుకుంది. చివరకు సంబంధిత శాఖ మంత్రి నారాయణ స్వామి సొంత నియోజకవర్గంలోనూ సారా ఏరులై పారేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సారా రహిత జిల్లాగా మార్చడంపై ఎక్సైజ్ శాఖ అధికారులు దృష్టి సారించారు. సారా తయారీ స్థావరాలపై నిత్యం దాడులు చేసి, కేసులు నమోదు చేస్తున్నారు. గత నెల 16 నుంచి ఈ నెల 23 వరకు ఎక్సైజ్ అధికారులు సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించి 70 కేసులు నమోదు చేశారు. 37 వేల లీటర్ల సారా ఊట ధ్వంసం చేసి, 450 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు.పుంగనూరు మండలం లోని పెద్దతండా, పత్రపల్లె తండాల్లో గత బుధవారం ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి ఏకంగా 1600 లీటర్ల సారాఊటను ధ్వంసం చేశారు.పత్రపల్లె తండాలో సారా విక్రయిస్తున్న చిన్నరెడ్డప్ప నాయక్‌ను పట్టుకున్నారు. ఎస్ఆర్‌పురంలో 19 లీటర్ల సారాను పట్టుకుని ముగ్గురిని అరెస్టు చేశారు.అయినా పెద్దగా మార్పు కనిపించడం లేదు.

సారా కాటుకు బలి



మృతుడు మదన్‌మోహన్

పుంగనూరు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నాటు సారా అతిగా తాగి మృతి చెందిన సంఘటన శుక్రవారం పుంగనూరు మండలం సుగాలిమిట్టలో జరిగింది.సోమల మండలం పొదలగుట్లపల్లె పంచాయతీ వడ్డిపల్లెకు చెందిన మదన్‌మోహన్(58)శుక్రవారం సుగాలిమిట్టకు వచ్చాడు. బంధువుల ఇంటికి వచ్చి పూటుగా సారా తాగి రోడ్డు పక్కన పడి మృతి చెందాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు.మదన్‌మోహన్ మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కఠిన చర్యలు తప్పవు

సారా తయారీ, రవాణా, అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. జిల్లావ్యాప్తంగా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, స్థానిక ఎక్సైజ్ సిబ్బందితో కలసి విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నారు. తరాలుగా సారా తయారీ, విక్రయాలను జీవనోపాధిగా చేసుకున్న వారుండే గ్రామాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపుతున్నాం. బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి కిరాణా దుకాణాలు, పాడి ఆవుల పెంపకం, టైలరింగ్ తదితర వ్యాపారాలు చేసుకునేందుకు సహకరిస్తున్నాం. చిత్తూరును సారా రహిత జిల్లాగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

- శ్రీనివాస్, ఎక్సైజ్ సూపరింటెండెంట్

కాణిపాక ఆలయ ఈవోగా కిషోర్



ఐరాల(కాణిపాకం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఈవోగా డిప్యూటీ కలెక్టర్ పెంచల కిషోర్ నియమితులయ్యారు. ఆగస్టు 31నుంచి ఇక్కడ ఈవోగా పని చేస్తున్న గురుప్రసాద్‌ను కర్నూలు జిల్లా ఏడీసీగా బదిలీ చేశారు. డిప్యూటీ కలెక్టర్ పెంచల కిషోర్‌ను విజయవాడ రెవెన్యూ జీఏడీ నుంచి కాణిపాక ఆలయ ఈవోగా బదిలీ చేశారు.2014లో ఆలయంలో నిర్వహించిన వార్షిక బ్రహ్మోత్సవ కమిటీ సమావేశాన్ని చిత్తూరు ఆర్డీవో హోదాలో పెంచల కిషోర్ నిర్వహించారు.అప్పట్నుంచీ ఆయనకు ఈ ఆలయంపై పూర్తిస్థాయిలో అవగాహన ఉంది.

తిరుపతికి ముగ్గురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం జరిగిన 66 మంది స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో జిల్లాకు ముగ్గురు అధికారులు రానున్నారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న సుధారాణి జీఎన్ఎస్ఎస్ (గాలేరు-నగరి-సుజలస్రవంతి) యూనిట్-1కు.. కలెక్టరేట్‌లోని ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్‌కు రోజ్‌మాండ్.. టీటీడీలోని భూసేకరణ విభాగానికి (ఎల్ఏ) వెలిగొండ స్పెషల్ కలెక్టర్ పీఏగా పనిచేస్తున్న సువర్ణమ్మను నియమించారు.

సీఎం.. తిరుగు ప్రయాణం

- మార్గమధ్యంలో క్రీడాకారుల కృతజ్ఞతాపూర్వక స్వాగతం



విమానాశ్రయం వద్ద సీఎంకు కలెక్టర్, ఇతర అధికారుల వీడ్కోలు

తిరుపతి/రేణిగుంట/చంద్రగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సోదరుడి కర్మక్రియల కోసం బుధవారం నుంచీ స్వగ్రామమైన నారావారిపల్లిలో గడిపిన సీఎం చంద్రబాబు శుక్రవారం ఉదయం రాజధానికి తిరుగు ప్రయాణమయ్యారు. నారావారిపల్లెలో ఉదయం పలువురు పార్టీ నేతలు కలిశారు. నాయకులతో మాట్లాడిన సీఎం వారి నుంచీ విజ్ఞాపనలు స్వీకరించారు. ఆపై 10.05 గంటలకు నివాసం నుంచీ తిరుగు ప్రయాణమయ్యారు. ఇటీవల క్రీడా రంగానికి ప్రోత్సాహాన్ని అందించేలా రాష్ట్ర ప్రభుత్వం నూతన క్రీడా విధానాన్ని ప్రకటించింది. ఈ నేపథ్యంలో శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు ఆధ్వర్యంలో శ్రీనివాసమంగాపురం నుంచీ తిరుపతి రూరల్ కాలూరు వరకూ రెండు కిలోమీటర్లు వేలాది మంది క్రీడాకారులు రోడ్డుకు ఇరువైపులా నిలుచుని 'థ్యాంక్యూ సీఎం' అంటూ ప్లకార్డులు ప్రదర్శించి కృతజ్ఞతలు తెలిపారు. వీరిని గమనించిన సీఎం చంద్రబాబు కాన్వాయ్ ఆపి శాప్ ఛైర్మన్ రవి నాయుడుతో కలసి వాహనం ఫుట్ బోర్డుపై నిలుచుని వారికి అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

చెన్నై వెళ్ళిన మంత్రి నారా లోకేశ్

గురువారం రాత్రి నారావారిపల్లెలోనే బస చేసిన మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ఉదయం 8 గంటలకు నివాసం నుంచీ వెలుపలికి వచ్చి ప్రజలను, నాయకులను కలుసుకున్నారు. ప్రజల నుంచీ అర్జీలు స్వీకరించారు. అనంతరం 8.30 గంటలకు బయల్దేరి రేణిగుంట విమానాశ్రయం చేరుకుని.. చెన్నై వెళ్ళారు.శ్రీపెరంబుదూర్‌లో వున్న రామానుజర్ ఆదికేశవ పెరుమాళ్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించాక స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం 12 గంటలకు సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, రామ్మూర్తినాయుడు సతీమణి నారా ఇందిర, కుమారులు నారా గిరీష్, నారా రోహిత్‌నారావారిపల్లె నుంచి తిరుగు పయనమయ్యారు.



అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి లోకేశ్





బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 8 గంటలకు ముత్యపు పందిరి
- మధ్యాహ్నం 12.30 గంటలకు స్నపన తిరుమంజనం
- సాయంత్రం 5.30 గంటలకు ఊంజలసేవ
- రాత్రి 7 గంటలకు సింహవాహనం





వాన జల్లుల్లో చల్లని తల్లి వేడుకలు



తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు వాన జల్లుల నడుమ వేడుకలు ఘనంగా కొనసాగాయి. సుప్రభాతసేవ అనంతరం సహస్రఅర్చన, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం వాహన మండపంలో పట్టు పీతాంబరాల వజ్రవైడూర్యాలు స్వర్ణాభరణాలతో అమ్మవారిని అలంకరించి పెద్దశేషుడిపై అధిష్ఠింపజేశారు. ఉదయం పరమపద వైకుంఠనాథుని రూపంలో పెద్దశేష వాహనంపై తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను సాక్షాత్కరించారు. వర్షం కారణంగా కొంతసేపు ఘటటోపం నీడన అమ్మవారి వాహనసేవ సాగింది. సాయంత్రం 6 గంటలకు వీణచేతపట్టిన సరస్వతిదేవిగా శ్వేతవర్ణ పట్టువస్త్రం, వజ్రవైడూర్య స్వర్ణాభరణాలతో ఊంజలసేవలో అమ్మవారు భక్తులను అనుగ్రహించారు. అనంతరం అస్థాన మండపం నుంచి వేంచేపుగా వాహన మండపానికి తీసుకొచ్చి అమ్మవారి ఉత్సవమూర్తిని హంసవాహనంపై కొలువుదీర్చారు. రాత్రి గజతురగ అశ్వాలు ముందుకు సాగుతుండగా భక్తుల కోలాటాలు, భజన బృందాలు, మంగళవాయిద్యాలు, జీయర్ స్వాముల ప్రబంధపారాయణం నడుమ అమ్మవారు హంసవాహనంపై అలయ మాడవీధుల్లో ఊరేగారు. భక్తులతో ఆలయ మాడవీధులు కిక్కిరిసిపోయాయి. ఈ కార్యక్రమాల్లో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్‌బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ ప్రసాద్, సుబ్బరాయుడు, చలపతి, సుభాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి











శ్రీవారికి వైఖానసం.. అమ్మవారికి పాంచరాత్రం ఎందుకిలా?



కాండూరు శ్రీనివాసాచార్యులు

తిరుమలేశుడికి వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం నిత్య కైంకర్యాలు, పూజలు, ఉత్సవాలు నిర్వహిస్తే, ఆయన దేవేరి పద్మావతి అమ్మవారికి పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా వీటిని నిర్వహిస్తారు. ఎందుకు ఇలా.. అనే సందేహానికి అమ్మవారి ఆలయ అర్చకులు, కంకణభట్టార్ కాండూరు శ్రీనివాసాచార్యులు ఇలా వివరించారు...

"నిత్య కైంకర్యాలు, పూజలు, ఉత్సవాలు ఎలా నిర్వహించాలి.. అనే అంశాన్ని వైకుంఠంలో శ్రీమహావిష్ణువు అయిదు రాత్రుల పాటు అమ్మవారికి వివరించారట. తొలుత అమ్మవారికి ఆ తర్వాత వరుసగా ఆదిశేషుడు, గరుత్మంతుడు, బ్రహ్మ, పరమేశ్వరులకు ఐదురాత్రుల ఆగమశాస్త్రాన్ని ఉపదేశించారు. సాక్షాత్తు స్వామివారే ఐదు రాత్రులు ఉపదేశించడం వల్ల ఈ శాస్త్రానికి పాంచరాత్ర ఆగమశాస్త్రం అనే పేరువచ్చింది. ఆ తర్వాత దీనిని 40వేల మంది ఋషులు- మహాఋషులు, దాన ఋషులు, బ్రహ్మఋషులు, రాజ ఋషులు 1006 సంహితరూపంగా రచించి అందించారు. అందులో 108 సంహితాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వీటి ఆధారంగానే ఆయా ఆలయాల్లో ఒక్కొక్క సంహితను అనుసరించి పూజలు నిర్వహిస్తున్నారు. ఇది మనసుల్లో అజ్ఞానాన్ని పోగొట్టి జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. తిరుచానూరు అమ్మవారి ఆలయంతోపాటూ భద్రాచలం, శ్రీకూర్మం, సింహాచలం, శ్రీరంగం, కంచి, కుంభకోణం, కురుక్షేత్రం, ఒంటిమిట్ట తదితర ఆలయాల్లో పాంచరాత్ర ఆగమశాస్త్రంను అనుసరించే పూజలు జరుగుతున్నాయి. వైఖానసం విషయానికి వస్తే.. తిరుమల శ్రీవారి ఆలయంతోపాటూ, నాగలాపురం, నారాయణవనం, అప్పలాయగుంట, శ్రీనివాస మంగాపురం, కార్వేటినగరం, గోవిందరాజస్వామి ఆలయం, కీలపట్ల తదితర ఆలయాల్లో స్వామివార్లకు వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం నిత్యకైంకర్యాలు, పూజలు, ఉత్సవాలు నిర్వహిస్తారు."

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

ఫల పుష్పాలే మాలలుగా.. తిరుమంజన సేవ

అమ్మవారి స్పర్శ క్షణకాలమే అయినా పవిత్రమైనది.. అపురూపమైనది. స్నపనతిరుమంజన కార్యక్రమంలో ఉత్సవమూర్తికి చేసే అలంకరణలు స్వల్పకాలానికే పరిమితమైనా విభిన్నంగా కొనసాగుతాయి. పూలు, పలాలు, ఎండు ఫలాలతో మాలలు కట్టి అలంకరిస్తారు. ఏదీ కొన్ని నిముషాలకు మించి అమ్మవారి మెడలో ఉండదు. అయినా ప్రత్యేకంగా ఫల, పుష్పాలతో అలంకరించిన శ్రీకృష్ణ ముఖ మండపంలో ఈ స్నపన తిరుమంజనసేవ జరుగుతుంది. శుక్రవారం మధ్యాహ్నం కంకణభట్టర్ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన సేవలో ఏడు రకాల మాలలను అమ్మవారికి అలంకరించారు. ఇందులో నెమలి ఈకలు, తామర పూల గింజలు, పైనాపిల్, రోజ్ పెటల్స్, నందివర్ధనం మొగ్గలు, తులసిమాలలు, కిరీటాలు, గొడుగులు ఉన్నాయి. ఈ మాలలను ఓ భక్తుడు అమ్మవారికి కానుకగా అందించారు. మండపాన్ని వివిధ రకాల సాంప్రదాయ పుష్పాలు, కట్ ఫ్లవర్స్‌తో పాటు ఆపిల్, జామ, మొక్కజొన్న, ఆర్కిడ్స్, పైనాపిల్ వంటి ఫలాలతో అలంకరించారు.



ఫలపుష్పాలతో ఆకట్టుకుంటున్న కేటీ మండపం



ఉత్సవమూర్తికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు



నెమలి ఈకలు, తామర గింజలు, నెల్లికాయ మాలలు

ఫిబ్రవరి 21 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఫిబ్రవరి 21 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు.21న కన్నప్ప ధ్వజారోహణం, 22న స్వామివారి ధ్వజారోహణం, 26న మహాశివరాత్రి, రాత్రి నందిసేవ, 27న ఉదయం రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం, 28న స్వామిఅమ్మవార్ల కల్యాణం, 1న సభాపతి కల్యాణం, 2న కైలాసగిరి ప్రదక్షిణ, 3న ధ్వజావరోహణం, 4న పల్లకీ సేవ, 5న ఏకాంతసేవ, 6న శాంతి అభిషేకం జరుగుతుందన్నారు.

నేడు అష్టోత్తర శత కలశాభిషేకం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం ఉదయం అష్టోత్తర శతకలశాభిషేకం, బిల్వ నిమజ్జనం నిర్వహించనున్నట్టు ఈవో బాపిరెడ్డి తెలిపారు. అలాగే సాయంత్రం 7గంటలకు స్వర్ణముఖిలో నదీ హారతులు జరుగుతాయని తెలిపారు.

ఎర్రచందనం రవాణా కేసులో ఏడుగురికి ఆరేళ్ల జైలు

రూ.6 లక్షల చొప్పున జరిమానా

మంగళం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డ ఏడుగురికి ఎర్రచందనం కేసుల ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి ఆరేళ్ల జైలుశిక్ష, ఆరు లక్షల రూపాయల చొప్పున జరిమానా విధించినట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. 2017లో కరకంబాడి బీట్ టీఎన్ పాలెం సెక్షన్‌లో పట్టుబడిన కేసులో ఏడుగురు ముద్దాయిలకు శిక్ష పడినట్లు చెప్పారు. చిత్తూరు జిల్లాకు చెందిన అద్దంకి గంగాధరం, తుపాకుల గంగాధరం, తుపాకుల శ్రీనివాసులు, గుండ్రాళ్ల మునయ్య, పాముల నాగయ్య, టీ.బంగారయ్య, తమిళనాడుకు చెందిన కె.మురగయ్యలు ఇందులో ఉన్నారన్నారు.

త్వరలో జైలుకు ముగ్గురు వైపీసీ నేతలు

సమస్యల పరిష్కారానికి మండలాల వారీగా ప్రత్యేక సిబ్బంది ● ఎమ్మెల్యే సుధీర్ వెల్లడి

శ్రీకాళహస్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అక్రమార్కులను త్వరలోనే జైలుకు పంపుతామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం ప్రజాసమస్యల పరిష్కారం కోసం మండలాల వారీగా సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ల జాబితాను విడుదల చేసిన ఆయన.. మీడియాతో మాట్లాడారు. శ్రీకాళహస్తిలో కొందరు వైసీపీ నాయకులు ఐదేళ్లపాటు సాగించిన దుర్మార్గాలను వెలికి తీస్తున్నట్లు చెప్పారు. మరో మూడు రోజుల్లోనే ముగ్గురు వైసీపీ నాయకులు జైలుకు వెళ్లబోతున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం మండలాల వారీగా ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణానికి మనోజ్ కుమార్‌ను 94917 06316 నెంబరులో సంప్రదించాలని సూచించారు. అలాగే శ్రీకాళహస్తి మండలానికి మణెమ్మ (70321 78191), తొట్టంబేడుకు భారతి (91820 31426), ఏర్పేడుకు హేమ (94418 55838), రేణిగుంటకు సుజాత (83670 90320)ను నియమించామన్నారు. ఈ మేరకు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. పలువురు బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.



అన్నా.. చనిపోతున్నా..!

తిరుమల నుంచి సెల్ఫీ వీడియో పంపిన యువతి ● పోలీసులను ఆశ్రయించిన సోదరుడు ● గంట వ్యవధిలోనే యువతిని గుర్తించిన టూటౌన్ పోలీసులు

తిరుమల, నవంబరు29(ఆంధ్రజ్యోతి): తన భర్తతో జరిగిన గొడవ కారణంగా తాను ఆత్మహత్య చేసుకోబోతున్నానంటూ ఓ యువతి తిరుమల నుంచి తన అన్నకు వీడియో పంపింది. దీనిపై అతడు నిమిషాల వ్యవధిలో ఇక్కడి పోలీసులకు సమాచారం ఇవ్వగా.. గంట వ్యవధిలోనే ఆమెను గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. తమిళనాడులోని హోసూర్‌కు చెందిన శంకర్, భావన దంపతులకు ఇద్దరు పిల్లలు. భర్తతో జరిగిన గొడవ కారణంగా గురువారం రాత్రి ఆమె ఇంటి నుంచి తిరుమలకు బయలుదేరింది. శుక్రవారం ఉదయం ఆమె శ్రీవారిమెట్టు మార్గం నుంచి 'నా భర్తతో గొడవ జరిగింది. తాను ఆత్మహత్య చేసుకోబోతున్నా' అంటూ సెల్ఫీ వీడియో రికార్డు చేసి వాట్సాప్ ద్వారా బెంగుళూరులోని తన అన్న ప్రసాద్‌కు పంపింది. ఆ తర్వాత కుటుంబ సభ్యులు ఎన్నిసార్లు ఫోను చేసినా ఈమె నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఉదయం పదిన్నర గంటల సమయంలో కంట్రోల్ రూమ్ నుంచి తిరుమల పోలీసులను ప్రసాద్ ఆశ్రయించి, తన చెల్లిని కాపాడాలని కోరారు. వెంటనే టూటౌన్ సీఐ శ్రీరాముడు ఆధ్వర్యంలో రెండు బృందాలు ఆ సెల్ఫీ వీడియో సాయంత భావన కదలికలపై సీసీ కెమెరాల ఫుటేజ్, సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నిఘా పెట్టి.. గాలించారు. 11.30 గంటల సమయంలో తిరుమలలోని ఎస్వీ గెస్ట్ హౌస్ వద్ద భావనను గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారికి ఆమెను అప్పగించి.. ఆ యువతికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు.



యువతిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

తుపాన్‌గా మారనున్న వాయుగుండం

కారైకల్- మహాబలిపురం మధ్య నేటి మధ్యాహ్నం తీరం దాటే అవకాశం

తిరుపతి/సూళ్లూరుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తుపానుగా మారనుంది. ఈ ఫెంగల్ తుపాన్ శుక్రవారం మధ్నాహ్నం నుంచి గంటకు 8 కిలోమీటర్ల వేగంతో ఉత్తర వాయుదిశగా కదులుతూ అదే ప్రాంతంలో కేంద్రీకృతమై ఉంది. ఈ తుపాన్ కదలికలను, దీని తీవ్రత ఏ ప్రాంతాల్లో అధికంగా ఉంటుందనేది ముందస్తుగా ఇస్రో ఉపగ్రహాల ద్వారా సమగ్ర సమచారం సేకరించి ప్రభుత్వానికి సమాచారాన్ని చేరవేస్తున్నారు. షార్ కేంద్రంలో రాడార్ ద్వారా కూడా తుపాన్ కదలికలను పసిగడుతున్నారు. ఇటీవల ఇస్రో ప్రయోగించిన ఈవోఎస్-08, ఇన్‌శాట్-3డీఆర్ ఉపగ్రహాల ద్వారా తుపాన్ తీవ్రత, దిశ మార్పు, సముద్రంలో వీచే గాలులు, అక్కడ వాతావరణ పరిస్థితులను ఇస్రో సేకరించి ప్రభుత్వానికి చేరవేస్తున్నట్లు సీనియర్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ తుపాన్ ప్రస్తుతం చెన్నైకి ఆగ్నేయంగా 380 కిలోమీటర్ల దూరంలో, పుదుచ్చేరికి తూర్పు ఆగ్నేయంగా 340 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. ఇది బలపడి వాయవ్య దిశగా పయనించి శనివారం మధ్యాహ్న సమయంలో పుదుచ్చేరి దగ్గర కారైకల్-మహాబలిపురం మధ్య తీరం దాటే అవకాశం ఉంది. ఈ సమయంలో గంటకు 60 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. దీని ప్రభావంతో నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్ష సూచనలు ఉన్నాయి.తిరుపతి జిల్లాలో సముద్ర తీర ప్రాంతాలైన కోట, వాకాడు, చిల్లకూరు మండలాల్లో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉంది. వర్షపాతం లేకున్నా ఈ మండలాల పరిధిలో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. సాయంత్రం నుంచీ అలల ఉధృతి పెరిగింది. పది అడుగుల ఎత్తున అలలు ఎగసి పడుతున్నాయి. సముద్ర తీర ప్రాంత మండలాలపై జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదంటూ అధికార యంత్రాంగం హెచ్చరికలు జారీ చేసింది.తడ, సూళ్ళూరుపేట, చిట్టమూరు మండలాల్లో మాత్రం శుక్రవారం రాత్రి 8 గంటల నుంచీ మోస్తరు వర్షం కురుస్తోంది.తిరుపతి జిల్లాలో శుక్రవారం అప్పుడప్పుడు చిరు జల్లులు తప్ప వర్షమేమీ కురవలేదు. చలి గాలులు మాత్రం జనాన్ని వణికించాయి. జిల్లాలో భారీ నుంచీ అతి భారీ వర్షాలు కురుస్తాయని, మెరుపు వరదలు కూడా సంభవించే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించడంతో తీర ప్రాంతంలోని మండల కేంద్రాల్లోనూ కంట్రోల్ రూములు ఏర్పాటయ్యాయి. ఇక, జిల్లావ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి.



శీగలపల్లెలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో సాగు విధానాలను తెలుసుకుంటున్న ప్రతినిధుల బృందం

ఆహార, ఆరోగ్య సవాళ్లకు ప్రకృతి సేద్యం పరిష్కారం

● భారతీయ వ్యవసాయ విధానంపై అంతర్జాతీయ ప్రతినిధుల బృందం ప్రశంస

కుప్పం/రామకుప్పం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):ఆగ్రో ఎకాలజీ, వాతావరణ కాలుష్యం, ఆహారం, ఆరోగ్యం వంటి సవాళ్లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పరిష్కారాలను చూపుతున్నారని అంతర్జాతీయ వ్యవసాయ ప్రతినిధులు ప్రశంసించారు. కుప్పం నియోజకవర్గంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను పరిశీలించేందుకు 20 దేశాలకు చెందిన 51మంది ప్రతినిధుల బృందం శుక్రవారం పర్యటించింది.కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంతో రైతు సాధికార సంస్థ సీనియర్ అధికారులు, అంతర్జాతీయ వ్యవసాయ ప్రతినిధుల బృందం పర్యటన ప్రారంభమైంది. మూడు బృందాలుగా విడిపోయిన ప్రతినిధులు కుప్పం మండలం శీగలపల్లె, రామకుప్పం మండలం అంకిరెడ్డిపల్లె, సింగసముద్రం, జీడిమాకులపల్లెల్లో పర్యటించి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. బీజామృతం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, విత్తన గుళికల తయారీని రైతు సాధికార సంస్థ అధికారులు డెమో పద్ధతిలో ప్రదర్శించారు. ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలతో పాటు రసాయనిక వ్యవసాయ క్షేత్రాలను కూడా పరిశీలించి రెండింటికీ మధ్య గల తేడాలను అవగాహన చేసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ రైతులు జి.కృష్ణమూర్తి, కేఎం.వెంకటరమణ, జీవీ.సత్యనారాయణ, ఎం.మురుగేశ్, ఆర్.హనుమంత కుమార్ అనుసరిస్తున్న ఏ గ్రేడ్ మోడల్స్, రైతులకు ఏడాది పొడవునా ఆదాయం కల్పించే నమూనా, షేడ్ నెట్ కూరగాయలు, సూర్యమండలం, యూనివర్సల్ మోడల్ కాంపాక్ట్ బ్లాక్ మోడళ్లను బృంద సభ్యులు సందర్శించారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, ఏపీసీఎన్ఎఫ్ రీజనల్ కో ఆర్డినేటర్ చక్రాల చంద్రశేఖర్ మునిరత్నం, జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ మురళీకృష్ణ, జిల్లా మేనేజర్ వాసు, రైతు సాధికార సంస్థ ప్రతినిధులు రాము, భాగ్యలక్ష్మి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



సింగసముద్రంలో పంటలను పరిశీలిస్తున్న ప్రతినిధుల బృందం



ప్రజా ప్రతినిధులు, అధికారులకు సమస్యను విన్నవించుకుంటున్న గ్రామీణుడు

'వినతుల' పండుగ!

కుప్పం/గుడుపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండలం సోడిగానిపల్లెలో శుక్రవారం కడా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌కు జనం వెల్లువెత్తారు. తమ సమస్యలను విన్నవించుకునే ముందు గ్రామానికి తరలివచ్చిన ప్రజా ప్రతినిధులను, రాజకీయ నాయకులను, అధికారులను సాదరంగా ఆహ్వానించారు. సమస్యలపై నివేదించారే తప్ప, ఎందుకు పరిష్కరించలేదని నిలదీయలేదు. సాధ్యమైనంత త్వరగా పరిష్కారాలు చూపమని వేడుకున్నారు. కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రజా దర్బార్‌లో ముఖ్య అతిథులుగా హాజరైన ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ అట్టడుగున గల బడుగు జీవి సమస్యలు సైతం తీర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పించారన్నారు. ఆ సంకల్పంలో భాగంగానే అధికారులే గ్రామాలకు వచ్చి మరీ సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.ప్రజలనుంచి మొత్తం 327 వినతులందాయి.రెవెన్యూ సమస్యలకు సంబంధించి 62 అర్జీలు, హౌసింగ్ 162, అనిమల్ హజ్బెండ్రీ 25, ఎంపీడీవో 51, ఆర్‌డబ్ల్యుఎస్ 2, పీఆర్ డీఈ 2, రెస్కో 2, మెడికల్ 14, కడా గ్రీవెన్స్ సెల్‌కు సంబంధించి 7 అర్జీలు వచ్చాయి.టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, టీడీపీ గుడుపల్లె మండల అధ్యక్షుడు బాబు, జనసేన మండల ఇన్‌ఛార్జి అమీర్, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అరుణాచలం, తహసీల్దారు సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈల అభివృద్ధికి సర్వే: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈల అభివృద్ధికి ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహకారంతో కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఎంఎస్ఎంఈ యూనిట్ల సర్వే శుక్రవారం నుంచి వచ్చే ఫిబ్రవరి 1 వరకు జరుగుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది సర్వే నిర్వహిస్తారన్నారు. తొలుత ఎంఎస్ఎంఈలపై అవగాహన శిబిరాలు నిర్వహించి ప్రభుత్వ ప్రోత్సాహకాలపై అవగాహన కల్పిస్తారన్నారు

రాజధాని నిర్మాణానికి రూ.లక్ష విరాళం

యాదమరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి మూడు గ్రామాలకు చెందిన వారు రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. మండల పరిధిలోని నర్రాపూరు, బలిజపల్లి, మజరా కొత్తపల్లి పంచాయతీల గ్రామస్థులు అమరావతి నిర్మాణానికి విరాళాలు సేకరించి శుక్రవారం నారావారిపల్లిలో సీఎంకు అందజేశారు. రాజధాని నిర్మాణంలో భాగస్వామ్యం కావడం పట్ల సీఎం వారిని అభినందించారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు

చౌడేపల్లె, నవంబరు29(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు, అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ ఈవో ఏకాంబరం ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ

ఏనుగుల దాడిలో వరిపంట ధ్వంసం



వెలుతురుచేనులో వరిపంటను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు

బంగారుపాళ్యం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బోడబండ్ల బీటు వెలుతురుచేను అటవీప్రాంతంలో గురువారం రాత్రి 14 ఏనుగుల గుంపు వరి,చెరకు,బొప్పాయి పంటలను ధ్వంసం చేశాయి. వరి దిగుబడి దశలోనే తొక్కి నాశనం చేశాయని రైతులు శంకర్, రవి, కాశి, మహాలింగం, సుందరం, డిల్లీబాబు, పిచ్చాండి, మణి, కుబేంద్ర, గోవిందస్వామి, సుబ్బ ఆవేదన చెందుతున్నారు. నూర్పిడి చేసి ఆరబెట్టిన పది మూటల ధాన్యాన్ని ఏనుగులు తినేశాయని వీరు చెప్పారు. గ్రామానికి చెందిన 50 మంది రైతులు రాత్రివేళ డప్పులు వాయిస్తూ, టపాకాయలు పేలుస్తూ ఏనుగుల గుంపును పెద్దకొండ వైపు మళ్ళించారు. ఆ ఏనుగులు పెద్దకొండలో తిష్టవేయడంతో వీరంతా బావుల వద్ద మంటలు వేసుకుని కాపుకాస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

చిత్తూరు అర్బన్, నవంబరు 29(ఆంధ్ర జ్యోతి): గంజాయి విక్రయిస్తూ ఓ వ్యక్తి పట్టుబడినట్లు రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య శుక్రవారం మీడియాకు తెలిపారు. ఇటీవల ఇరువారం సమీపంలో రెండు కేజీల గంజాయి దొరికిన కేసులో పరారైన నిందితుడు శరవణను శుక్రవారం పోలీసులు తిరుపతి- బెంగళూరు బైపాస్‌రోడ్డులో అరెస్టు చేశారు. ఇప్పటికే ఈ కేసులో రవితేజను అరెస్టు చేయగా పరారీలో ఉన్న వెంకటేశ్ కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు. ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుడిని మీడియాకు చూపిస్తున్న సీఐ నెట్టికంఠయ్య

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలు

ఇద్దరి పరిస్థితి విషమం

పుంగనూరు రూరల్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): పుంగనూరు - మదనపల్లె రోడ్డు మార్గంలోని ఈడిగపల్లె వద్ద బొలెరో జీపు ఆగి ఉన్న ఈచర్ వాహనాన్ని ఢీకొనడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన రామమూర్తికి పక్షవాతంతో బాధపడు తున్నాడు. బైరెడ్డిపల్లె మండలం విరూపాక్షిపురంలో శుక్రవారం తెల్లవారు జామును మందు తీసుకోవాలని కుటుంబసభ్యులు నిర్ణయించారు. ఆ మేరకు గురువారం అర్ధరాత్రి బొలెరోలో డ్రైవర్ వెంకటసుబ్బయ్య(24), రామమూర్తి భార్య కాశమ్మ(64), లక్ష్మీకాంత్(23), సరోజ(40) బైరెడ్డిపల్లె మండలం విరూపాక్షిపురానికి బయల్దేరారు. పుంగనూరు మండలం ఈడిగపల్లె సమీపంలో అదుపుతప్పి ఈచర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఐదుగురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వెంకటసుబ్బయ్య, లక్ష్మీకాంత్‌ల పరిస్థితి విషమంగా ఉండడంతో లక్ష్మీకాంత్‌ను తిరుపతికి, వెంకటసుబ్బయ్యను కడప ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసున్నారు.





గాయపడిన డ్రైవర్ వెంకటసుబ్బయ్య - రామమూర్తి, సరోజ

వన్యప్రాణులకు దూరంగా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతాల్లో విద్యుత్ తీగల కారణంగా ఏనుగులు మరణించకుండా అటవీ, విద్యుత్‌శాఖ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఈ శాఖల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బంగారుపాళ్యం, పలమనేరు, బైరెడ్డిపల్లి, గంగవరం, పెద్దపంజాణి, వి.కోట, పులిచెర్ల, కుప్పం మండలాల్లో 491 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయన్నారు. వీటి వల్ల అటవీ, వన్యప్రాణులకు ప్రాణహాని పొంచివుందన్నారు. వన్యప్రాణులకు హాని కలిగేలా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను నిర్మానుష్య ప్రాంతాలకు మార్పించాలన్నారు. ఇందుకు తనిఖీలు నిర్వహించి ప్రతిపాదనలు అందజేయాలని వానిఆదేశించారు. సమావేశంలో డీఎఫ్‌వో భరణి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఇస్మాయిల్, ఈఈ జగదీష్, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నేడు పార్థివలింగాలకు ప్రత్యేక పూజలు



పుంగనూరు, నవంబరు29(ఆంధ్రజ్యోతి): పుంగనూరు మినీ బైపాస్‌రోడ్డులోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ కోనేరులో శనివారం మధ్యాహ్నం అమావాస్య సందర్భంగా పార్థివలింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు సుబ్బయ్య, రామచంద్ర తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన అన్నపూర్ణేశ్వరీ దేవి, కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాన్ని జమీందార్లు నిర్మించగా అప్పటినుంచి కార్తీకమాసం బహుళ పంచమి అమావాస్య నాడు పార్థివలింగం పూజ నిర్వహించిన వారికి అనుకున్న శుభాలు కలుగు తాయని పెద్దల నమ్మకం. దీంతో ప్రతి ఏటా పార్థివలింగ పూజ చేస్తున్నట్లు వివరించారు. ప్రతి యేటా 11పుట్టల నుంచి మట్టి, శ్వేత చందనం, రక్తచందనం, భస్మం, తెల్లకర్పూరం, సుగంధ ద్రవ్యాల మిశ్రమంతో దాదాపు 500 పార్థివ లింగాలు తయారు చేసి వేద మంత్ర పారాయణంతో భక్తిశ్రద్ధలతో మూడు గంటల పాటు ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు వివరించారు. భక్తులకు ఉచితంగా పార్థివ లింగాలు అందిస్తామని, ప్రతిఒక్కరూ పార్థివ లింగానికి రుద్రాభిషేకం, పూజలు చేయవచ్చునని చెప్పారు. అనంతరం సాయంత్రం 6గంటలకు కోనేరులో కార్తీక దీపోత్సవం జరుగుతుందని, భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతిచెందిన చంద్ర

గంగవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పలమనేరు- బెంగళూరు జాతీయ రహదారిలో మండల పరిధిలోని గురువారం రాత్రి గండ్రాజుపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ కథనం మేరకు..పలమనేరు పట్టణంలోని పల్లెవీధికి చెందిన మెగిలప్ప కుమారుడు చంద్ర సొంతపనిపై పలమనేరు నుంచి నంగిలి వైపు వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందివుండడాన్ని స్థానికులు గుర్తించారు. చంద్ర గురువారం రాత్రి స్నేహితులతో కలిసి హోటల్లో భోజనం చేసి అక్కడ నుంచి గండ్రాజుపల్లె వైపు బయలుదేరాడు. రాత్రి ఏం జరిగిందో తెలియదు. శుక్రవారం ఉదయం తీవ్రగాయాలై మృతిచెందాడు. మృతుడు ద్విచక్ర వాహనం బోల్తాపడి మృతి చెందాడా లేక ఏదైనా గుర్తుతెలియని వాహనం ఢీకొని చనిపోయాడా అనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో నుంచి జారిపడి మహిళ మృతి



మంగళమ్మ (ఫైల్ ఫొటో)

గంగవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆటోనుంచి జారిపడి ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన పలమనేరు- మదనపల్లె రహదారిలోని గంగవరం ఫ్లైఓవర్ వద్ద చోటుచేసుకుంది. గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ కథనం మేరకు.. మండలంలోని కొత్తపల్లె గ్రామానికి చెందిన మంగళమ్మ (50) సొంత పనిపై శుక్రవారం పలమనేరుకు వచ్చింది. సాయంత్రం షేర్ ఆటోలో వెనుక కూర్చొని స్వగ్రామానికి బయలుదేరింది. గంగవరం సమీపంలోని కీలపట్ల క్రాస్ వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద ఆటో వేగంగా వెళ్లడంతో వెనుక కూర్చొన్న మంగళమ్మ అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడింది. తలకు తీవ్రగాయమై ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసులు ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫారెస్టు సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా కరుణకుమారి

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఫారెస్టు సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా కరుణకుమారిని నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.డ్వామా పీడీగా పనిచేస్తుండిన ఎన్.రాజశేఖర్‌ను స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించారు.

విద్యాశాఖ ఏడీగా రంగస్వామి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా సి.రంగస్వామి బదిలీపై రానున్నారు. డీఈవో కార్యాలయంలో రెండు ఏడీ పోస్టులుండగా, గతంలో ఏడీ,ఇన్‌చార్జి డీఈవోగా పనిచేసిన పురుషోత్తం అన్నమయ్య జిల్లా డీఈవోగా బదిలీ అయ్యారు. అప్పటినుంచి ఖాళీగా ఉన్న పోస్టుకు ఏడీ-2గా వెంకటేశ్వర్లు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈపోస్టుకు అనంతపురం జిల్లా పెనుగొండ డీవైఈవో రంగస్వామిని తాజాగా చిత్తూరుకు బదిలీచేస్తూ విద్యాశాఖడైరెక్టర్ విజయరామరాజు శుక్రవారం ఉత్తర్వులుజారీచేశారు.

అప్పుల బాధ తాళలేక రైలుకింద పడి ఆత్మహత్య



మునిరాజు (ఫైల్‌ఫొటో)

గుడుపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం మేరకు.. మిట్టూరుకు చెందిన క్రిష్ణప్ప కుమారుడు మునిరాజు(32) తమిళనాడులో నివాసం ఉండి అక్కడ ఓ షాపులో పనిచేస్తున్నాడు. పనిచేసే చోట కొంత మంది వద్ద అప్పులు చేశాడు. కొన్నిరోజులుగా అప్పు ఇచ్చిన వారినుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో గురువారం రాత్రి స్వగ్రామానికి చేరుకొన్నాడు. శుక్రవారం గుడుపల్లె సమీపంలోని రైల్వే గేటు దగ్గర రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు రైల్వే పోలీసులు అతడి మృతదేహాన్ని కుప్పం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల్లో చైతన్యం నింపేందుకే క్రీడలు

● ఎమ్మెల్యే మురళీమోహన్





త్రోబాల్ ఆడుతున్న విద్యార్థులు- చిన్నారిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో చైతన్యం నింపేందుకు క్రీడలు తోడ్పడుతాయని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. శుక్రవారం పూతలపట్టు ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి అండర్-14 త్రోబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాముఖ్యతను ఇస్తోందన్నారు. భరతనాట్యం చేసిన ఓ చిన్నారిని ఎమ్మెల్యే సన్మానించారు. మండల టీడీపీ కన్వీనర్ దొరబాబు చౌదరి, ఐరాల మండల కన్వీనర్ గిరిధర్ బాబు, మాజీ కన్వీనర్ చంద్రమౌళి, గుంటూరు మురళి, డీవైఈవో చంద్రశేఖర్, డీఎస్డీవో బాలాజీ, స్కూల్ గేమ్స్ సెక్రటరి వసంతవాణి, సీఐ కృష్ణమోహన్, జడ్పీటీసీ దేవిక, ఎంపీపీ కుమారి, పీడీలు రవీంద్రారెడ్డి, క్రిష్ణయ్య, బాబు, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అండర్-14 త్రోబాల్ పోటీల్లో 23 జిల్లాల నుంచి సుమారు 300 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. బాలుర త్రోబాల్ విభాగంలో కర్నూలు, ప్రకాశం జిల్లాల జట్లపై కడప, విశాఖపట్నంపై అనంతపురం, గుంటూరుపై చిత్తూరు జట్లు గెలుపొందాయి. బాలికల విభాగంలో ప్రకాశంపై కర్నూలు, తూర్పుగోదావరిపై చిత్తూరు, పశ్చిమ గోదావరిపై అనంతపురం జట్లు గెలుపొంది సెమీఫైనల్స్‌కు చేరాయి. ఈ జట్లు శనివారం తలపడనున్నాయి. ప్రాథమిక వసతులు లేక క్రీడాకారులు ఇబ్బంది పడ్డారు.

రామానుజర్ ఆదికేశవ పెరుమాళ్ ఆలయంలో లోకేశ్



ఆలయంలోకి వెళ్తున్న లోకేశ్

చెన్నై, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఉన్నతవిద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శ్రీపెరంబుదూర్‌లో వున్న రామానుజర్ ఆదికేశవ పెరుమాళ్ ఆలయాన్ని శుక్రవారం సందర్శించారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించాక స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆయన విమానంలో హైదరాబాద్ బయలుదేరివెళ్లారు. ఆలయంవద్ద లోకేశ్‌కు ఆలయ నిర్వాహకులు, చెన్నై టీడీపీ అధ్యక్షుడు చంద్రశేఖర్, టీడీపీ నేతలు మన్నూరు చలపతి, మన్నెం రవిబాబు, రాజేష్, జనార్దన్, ఉమాపతి, మోహన్ స్వాగతం పలికారు.

కాణిపాక ఆలయానికి వేలం ఆదాయం రూ.20.92 లక్షలు

ఐరాల(కాణిపాకం),నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక ఆలయానికి శుక్రవారం నిర్వహించిన ఆన్‌లైన్,సీల్డ్, బహిరంగ టెండర్ల ద్వారా రూ.20.92లక్షల ఆదాయం లభించింది. ఈ సందర్భంగా ఏఈవో రవీంద్రబాబు మాట్లాడుతూ దుకాణాల సముదాయంలో దుకాణం నెంబరు 27కు రూ.16.80లక్షలతో పాటదారుడు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. విఘ్నేశ్వర కల్యాణ మండపం వద్ద బంకు నిర్వహణకు రూ. 4.12లక్షలు వచ్చిందన్నారు వివరించారు. ఈ రెండింటికీ సంవత్సరాల పరిమితి ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈవో హరిమాధవరెడ్డి, దేవదాయ శాఖ అధికారి సుబ్రహ్మణ్యంనాయుడు,సూపరింటెండెంట్ బాలరంగస్వామి, హేమేశ్వర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ సొమ్ము చోరీ

నగరి, నవంబరు29(ఆంధ్రజ్యోతి): బీరకుప్పం పంచాయతీ పరిధికి చెందిన పెన్షన్ సొమ్ము రూ1,40,500 చోరీ అయినట్లు పంచాయతీ కార్యదర్శి బాబు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను సొమ్ము తీసుకుని నగరి బస్టాండుకు వస్తుండగా చోరీ అయిందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

రేపు ఎన్ఎంఎంఎస్ ఉచిత మాదిరి పరీక్ష

చిత్తూరు సెంట్రల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్(ఎన్ఎంఎంఎస్) ఉచిత మాదిరిపరీక్ష నిర్వహించనున్నారు. ఏస్‌పే సంఘం నాయకులు నరోత్తంరెడ్డి, సుబ్బారావులు ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చంద్రబాబును కలిసిన కుప్పం టీడీపీ నాయకులు



కుప్పం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గం నారావారిపల్లెలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కుప్పం టీడీపీ నాయకులు కలిశారు. టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, సత్యేంద్ర శేఖర్, చెక్కునత్తం మణి తదితరులు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

పదిలో మంచి ఫలితాలు సాధించాలి


భోజనాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ డైరెక్టరు దేవరాజులు

రొంపిచెర్ల, నవంబరు 29: (ఆంధ్రజ్యోతి) రొంపిచెర్ల కేజీబీవీలో ఈ ఏడాది మంచి ఫలితాలు సాధించాలని కేజీబీవీ అడిషనల్ డైరెక్టరు సి.దేవరాజులు అన్నారు. శుక్రవారం రొంపిచెర్లలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరీక్షించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచిచూశారు. మెనూ ప్రకారం భోజనం ఉండాలన్నారు. రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు చూసి తగిన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీసీడీవో ఇంద్రాణి, ఎంఈవో శ్రీనివాసులు, సీఆర్‌పీలు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాపారాభివృద్ధికి ప్రభుత్వ సాయం: కంచర్ల


పనిముట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్‌ఎం తదితరులు

కుప్పం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యం, వ్యాపారాభివృద్ధికోసం చేతివృత్తుల వారికి ప్రభుత్వం తరపున తగిన ఆర్థిక సాయం అందిస్తామని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పంలో శుక్రవారం ప్రధాన మంత్రి విశ్వకర్మ నైపుణ్య కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఇక్కడ ఉన్న పనిముట్లను పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం కింద చేతివృత్తుల వారు ఎలాంటి హామీ లేకుండా రూ.3 లక్షల వరకు రుణం పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, టీడీపీ నాయకులు డాక్టర్ వెంకటేశ్, సత్యేంద్రశేఖర్, కౌన్సిలర్ సోమశేఖర్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో పుంగనూరు విద్యార్థుల ప్రతిభ


క్రీడా పోటీల్లో విజేతలతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పుంగనూరు రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎస్వీయూ అథ్లెటిక్స్ పోటీల్లో పుంగనూరు శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు విజేతలుగా నిలిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం స్థానిక కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న జయలక్ష్మి లాంగ్‌జంప్‌తో పాటు 100 మీటర్ల హర్డిల్ ఈవెంట్‌లో తృతీయ స్థానంలో నిలిచిందని వివరించారు. అలాగే క్రీడాపోటీల్లో విద్యార్థులు ఎస్.ముబారక్, గంగోత్రి, జీవిత, స్ఫూర్తి, ఆసిఫ్ అలీ, దామోదర్, తరుణ్‌కుమార్, శివాజీ, ఎస్.ఉదయ్‌కుమార్, రిహాన్నా తదితరులు పాల్గొన్నారని చెప్పారు. జయలక్ష్మితో పాటు పోటీల్లో పాల్గొన వారిని ప్రిన్సిపాల్ రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్, పీడీ రాంకుమార్, అనీల్‌కుమార్, ఇతర అధ్యాపకులు అభినందించారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



పుంగనూరు, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): పుంగనూరు మున్సిపాలిటీలోని పారిశుధ్య కార్మికులకు యూనిఫాం, ఇతర వస్తువులను మున్సిపల్ చైర్మన్ అలీంబాషా పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 10మందికి యూనిఫాం, హెల్మెట్లు, ఆక్సిజన్ మాస్క్, హ్యాండ్ గ్లౌజ్‌లు పింపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఏఈ కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను పెంపొందించడమే ధ్యేయం

పుంగనూరు రూరల్, నవంబరు29(ఆంధ్ర జ్యోతి): ప్రతి ఒక్కరిలోనూ ఆధ్యాత్మికతను పెంపొందించడమే ధ్యేయంగా ఎన్వీఆర్ ట్రస్ట్ పని చేస్తున్నట్లు ఆ ట్రస్ట్ చైర్మన్, జనసేన నేత వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చదళ్ల చౌడేశ్వరీదేవి ఆలయంలో భగవద్గీత పుస్తకాలను పలువురికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి శివకుమార్‌రెడ్డి, హిందూజాగరణ సమితి సభ్యులు త్రిమూర్తిరెడ్డి, ఈశ్వరమ్మ, చిన్నారాయల్, ట్రస్ట్ సభ్యులు నరేంద్రరెడ్డి, నారాయణరెడ్డి, విరూపాక్షి పాల్గొన్నారు.

ఐఎంఏ అధ్యక్షుడికి ఘన సన్మానం



గంగవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఐఎంఏ అధ్యక్షుడిగా ఎంపికైన డాక్టర్ యుగంధర్‌ను సహచర వైద్య సిబ్బంది, స్నేహితులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. పలమనేరు నియోజకవర్గ ఐఎంఏ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) అధ్యక్షులు డాక్టర్ యుగంధర్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అధ్యక్షులుగా ఎంపికయ్యారు. నాలుగురోజుల క్రితం గుంటూరులో కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఐఎంఏ రాష్ట్ర నాయకుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. దీంతో పలమనేరులో సహచర డాక్టర్లు, వైద్యసిబ్బంది, స్నేహితులు గంగవరం లోని ఆర్‌వీఆర్ టవర్స్‌లో డాక్టర్ యుగంధర్ దంపతులకు పూలమాలలు వేసి శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ మమతారాణి, ఎన్జీవో సంఘ జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీపతియాదవ్, డాక్టర్లు బలరాం, షాహిద్, మల్లిఖార్జున్‌రెడ్డి, నాగమల్లీశ్వరి, శ్రీనివాసులు, రాజారెడ్డి, నాయకులు సుబ్రమణ్యం గౌడు, చెంగారెడ్డి, ఖాజా, ప్రహ్లాద, ఐఎంఏ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు జోరుగా సాగుతోంది

సోమల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు వేగవంతంగా సాగుతోందని మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు తెలిపారు. శుక్రవారం నంజంపేట, చిన్నఉప్పరపల్లె పంచాయతీల్లో సభ్యత్వ నమోదును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు రమేశ్ నాయుడు, రమణయ్య, మాజీ సర్పంచు సూరిశెట్టి సుధాకర్, అష్రఫ్ అలీ, బాబురావ్ పాల్గొన్నారు.

స్మార్ట్ లాక్‌తో చోరీలకు చెక్

సోమల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ లాక్స్‌తో చోరీలకు చెక్ పెట్టవచ్చునని సోమల ఎస్‌ఐ శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం సోమల మండలంలోని నంజంపేట, పెద్దఉప్పరపల్లె ఆలయాల వద్ద ప్రజలకు వీటిపై అవగాహన కల్పించారు. మండలంలోని పలుచోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని దీంతో పాటు సెక్యూరిటీ స్మార్ట్ లాక్‌లను అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. ప్రధానంగా ఆలయాలు, మసీదులు, చర్చిలు, షాపింగ్ కాంప్లెక్స్, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలకు ఈ లాక్‌లు అందజేస్తామని తెలియజేశారు. దొంగలు ఎవరైనా తాళాలు పగలగొట్టే ప్రయత్నం చేస్తే అందులోని అలారం మోగుతుందని పేర్కొన్నారు.

పెద్దఉప్పరపల్లెలో చోరీ

సోమల, నవంబరు 29: (ఆంధ్రజ్యోతి): సోమల మండలం పెద్దఉప్పరపల్లెలో గురువారం మధ్యాహ్నం బాబ్జీ ఇంట్లో చోరీ జరిగింది. బాబ్జీ ఆవులపల్లె సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. పుంగనూరులో మధ్యాహ్నం జరిగిన వివాహానికి కుటుంబ సమేతంగా కలసి వెళ్లాడు. ఈ క్రమం లోనే దుండగులు ఇంటి తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించి కొంత నగదు, బంగారు నగలు ఎత్తు కెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చిన బాబ్జీ కుటుంబ సభ్యులకు చోరీ విషయం తెలిసింది. బాబ్జీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఎస్‌ఐ శివశంకర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రేపు వైదేహి హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం

సోమల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు వైదేహి హాస్పిటల్ వైద్య బృందం ఆధ్వర్యంలో ఆదివారం సోమల హైస్కూల్ ఆవరణంలో పలు వ్యాధులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించ నున్నట్లు మాజీ ఐడీసీ డైరెక్టర్ వై.సాంబయ్య, టీడీపీ నాయకులు కామిశెట్టి నగేశ్ తెలిపారు. ఈ శిబిరంలో కాన్సర్, గుండె, కిడ్నీ, ఎముకలు, బీపీ, షుగర్, కీళ్లు, కంటి వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తామని కో-ఆర్డినేటర్ సతీశ్ తెలిపారు.

రేపు నేత్రచికిత్సా శిబిరం

పలమనేరు, నవంబరు29 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో డిసెంబరు1 వతేదీ ఆదివారం ఉచిత నేత్ర చికిత్సాశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో చెన్నై శంకరనేత్రాలయ వైద్యులు మురళి పరీక్షలు నిర్వహిస్తారని, ఆపరేషన్లు అవసరమున్న వారికి చెన్నై శంకరనేత్రాలయలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారని వివరించారు. చెన్నై వెళ్లిరావడానికి ఉచిత వాహన సౌకర్యం కల్పిస్తామని తెలియజేశారు.

రేపు మెగా వైద్యశిబిరం

పలమనేరు, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని బలిజ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో డిసెంబరు 1వ తేదీ స్థానిక వీజేసీ కల్యాణ మండపంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్యశిబిరంలో బెంగళూరు వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి చెందిన వైద్య బృందం పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈసీజీ, ఎకో, క్యాన్సర్ స్క్రీనింగ్, బీపీ, పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని వివరించారు. అలాగే క్యాన్సర్, గుండె, కిడ్నీ, బీపీ, షుగర్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, న్యూరాలజీ సమస్యలతో బాధపడుతున్న వారికి చికిత్సలు నిర్వహిస్తారని తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఈ ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు పెన్షన్ల పంపిణీ

సోమల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పెన్షన్లు పొందుతున్న లబ్ధిదారులకు శనివారం ఉదయం నుంచి నగదు పంపిణీ చేస్తామని ఎంపీడీవో నారాయణ తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో అందుబాటులో ఉండి పెన్షన్లు పొందాలన్నారు.

పనుల పురోగతిపై ఎమ్మెల్యే సమీక్ష

పలమనేరు, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీలోని పెండింగ్ పనుల పురోగతిపై ప్రణాళికా శాఖ అధికారులతో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి శుక్ర వారం సమీక్షించారు. ప్రధానంగా మున్సిపల్ వాణిజ్య సముదాయం నిర్మాణపనులు, టౌన్‌హాల్ నిర్మాణం, మురుగునీటి శుద్ధికి సంబంధించిన ప్లాంటు నిర్మాణం తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో ఏవైనా సమస్యలు ఉన్నా త్వరగా పూర్తిచేసి పనుల పురోగతికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏఈ స్నేహలత, టౌన్ ప్లానింగ్ అధికారి ఇందిర, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉద్యానరైతులకు శిక్షణ

శాంతిపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శాంతిపురంలో శనివారం మామిడి, టమోటా రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మండల ఉద్యాన అధికారి వింధ్య తెలిపారు. మండల సచివాలయంలో ఉదయం 10:30గంటలకు ప్రారంభమయ్యే ఈ శిక్షణలో పలువురు శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు సలహాలు, సూచనలు అందిస్తారని వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన వన రైతులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని శుక్రవారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన ఉద్యాన వన శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉద్యాన సమగ్రాభివృద్ధి మిషన్, రాష్ట్రీయ కృషివికాస్ యోజన పథకాలద్వారా అందుతున్న రాయితీలు, పండ్లతోటల విస్తరణ పథకంలో మామిడి, జామ, దానిమ్మ, తదితర పంటలతో పాటు యంత్రాలకు అందిస్తున్న రాయితీల వివరాలు అడిగి తెలుసుకొన్నారు. కోల్డు స్టోరేజి, మినీ ట్రాక్టర్లు, పాలీహౌస్‌లు, ప్యాక్ హౌస్‌లు, స్ప్రేయర్లను నియోజకవర్గంలోని ఎంతమంది రైతులకు ఇచ్చారన్న వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలమనేరు, పుంగనూరు ఉద్యాన వనశాఖ అధికారులు లక్ష్మీప్రసన్న, వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ఉయ్యాల రమణ

రొంపిచెర్ల, నవంబరు29: (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలని కురబకుల కార్పొరేషన్ డైరెక్టరు, మండల పార్టీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ కోరారు. శుక్రవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలతో సభ్యత్వ నమోదుపై పంచాయతీల వారీ తెలుసుకున్నారు. పుంగనూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 40వేలు వరకు సభ్యత్వాలు జరిగాయని, రొంపిచెర్ల మండలంలో 6500, పులిచెర్లలో 7900, చౌడేపల్లెలో 7360, సదుంలో 400, సోమలలో 6700, పుంగనూరు రూరల్ 6564,పుంగనూరు పట్టణంలో 4389 సభ్యత్వాలు చేశారని వివరించారు. సభ్యత్వ నమోదుపై టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ఉన్నారని తెలియజేశారు. అలసత్వం చేయకుండా నమోదులో వేగం పెంచాలని కోరారు. ఈ సమావేశంలో టీ-టీడీపీ నియోజకవర్గం అధ్యక్షుడు గూడూరు హరిబాబు, మాజీ కన్వీనర్ ఓబులేశ్వరరెడ్డి, మాజీ ఎంపీటీసీ అమరనాథరెడ్డి, మాజీ సర్పంచ్ రవికుమార్‌నాయుడు, మదనమోహన్‌రెడ్డి, కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ స్థలాలు చూపాలని ఆర్డీవోకు వినతి


ఆర్డీవో భవానికి వినతిపత్రం అందజేస్తున్న బోయకొండ బాధితులు

పలమనేరు, నవంబరు29 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం తమను నమ్మించి తమ నివాసాలను, దుకాణాలను తొలగించిందని తమకు మీరైనా న్యాయం చేయాలని బోయకొండ ఆలయం సమీపంలో ఉన్న బాధితులు శుక్రవారం పలమనేరు ఆర్డీవో భవానికి వినతిపత్రం అందజేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా తాము రోడ్డునపడ్డామని వాపోయారు. ప్రత్యామ్నాయ స్థలాలు చూపాలని, దుకాణాలు కేటాయించాలని కోరారు. జిల్లా రైతు కూలీ సంఘం అధ్యక్షులు ఓబుల్‌రాజు, జయన్న, పద్మమ్మ, వెంకటరమణ, ఎల్లప్ప, రెడ్డెప్ప, హరిక్రిష్ణ పాల్గొన్నారు.

పచ్చదనంతో మానసిక ఉల్లాసం


ఇనుప కంచెతో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం

సదుం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పచ్చదనంతో మానసిక ఉల్లాసం పొందవచ్చునని జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జైకుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పాఠశాల క్రీడా మైదానం చుట్టూ మణికంఠ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి వేప, అల్లనేరుడు, కానుగ తదితర మొక్కలను నాటారు. వాటి సంరక్షణ కోసం రూ.81 వేల విలువజేసే ఇనుప కంచెలను లయన్స్ క్లబ్ వారు వితరణగా అందజేశారు. అలాగే పీలేరుకు చెందిన సాయి దంత వైద్యశాల వైద్యుడు రామ్మోహన్ రెడ్డి స్థానిక ప్రభుత్వా స్పత్రిలో రోగులు, సహాయకులు కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేసేందుకు రూ.20 వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పెద్దిరెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, క్లబ్ నిర్వాహకులు లయన్ రాజారెడ్డి, సంజీవరెడ్డి, నాగరాజు, మనోజ్‌కుమార్ రెడ్డి, ఎన్‌సీసీ విద్యార్థులు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అడ్డగోలుగా బిల్లుల చెల్లింపు: గౌనివారి

శాంతిపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో కమీషన్ల కక్కుర్తితో వందల కోట్ల బిల్లుల చెల్లింపులు చేశారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కడప విమానాశ్రయాన్ని అడ్డుపెట్టుకుని జగన్ రూ.165కోట్లు స్వాహా చేశారని పేర్కొన్నారు. వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలను వెలికితీసి కారకులందరికీ కూటమి ప్రభుత్వంగుణపాఠం చెబుతుందని స్పష్టం చేశారు. వైసీపీ అరాచకాలు భరించలేక కూటమిని ప్రజలు గెలిపించారి పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి పాలన సాగిస్తోందని వివరించారు.

గాయపడిన మహిళకు రూ.5లక్షల ఆర్థికసాయం


సుగుణమ్మకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల

గుడుపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదంలో రెండు కాళ్లను కోల్పోయిన మహిళకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ రెస్కో ద్వారా రూ.5 లక్షల ఆర్థికసాయం అందించారు. మండలంలో కంచుబందార్లపల్లో గ్రామానికి చెందిన క్రిష్టప్ప భార్య సుగుణమ్మ 2021 ఫిబ్రవరి 14వ తేదీన పొలంలో పనిచేస్తుండగా 11కేవీ విద్యుత్ తీగ ఆమెపై పడింది. ఆమె తీవ్రగాయాలకు గురైంది. సంవత్సరాల పాటు ఆమె చికిత్స పొందింది. అయినా రెండు కాళ్లను కోల్పోవాల్సి వచ్చింది. నిరుపేద కుటుంబం వీరిది. ఆమె వైద్యం కోసం దాదాపు రూ.20 లక్షల వరకు అప్పులు చేశారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ చొరవతో రెస్కో తరపున శుక్రవారం ఆర్థికసాయం అందించారు.

పకడ్బందీగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించాలి

కల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 7వ తేదీన అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ కార్యదర్శి కోన శశిదర్, కమిషనర్ విజయరామరాజు ఆదేశించారని ఎంఈవో సిద్ధరామయ్య తెలిపారు. పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో విద్యాశాఖ కార్యదర్శి, కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ యాక్షన్ ప్లాన్‌పై దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థి వికాసానికి మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం ఓ దిక్సూచిగా నిలుస్తుందన్నారు. వార్షిక పాఠ్యప్రణాళికతో పాటు పోటీ పరీక్షలకు అవసరమయ్యే అదనపు ప్రణాళికలపై సమావేశంలో చర్చించాలన్నారు. వేదికపై ఎలాంటి రాజకీయ ఉపన్యాసాలు ఉండరాదని, ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, దాతలు, పూర్వ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలను ఆహ్వా నించాలన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు షెడ్యూల్ ప్రకారం సమావేశాలు నిర్వహించాలన్నారు.

మాతృసంస్థకు బదిలీ చేయండి


ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సెరికల్చర్ అసిస్టెంట్లు

పలమనేరు, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): తమను తమ మాతృసంస్థ అయిన పట్టుపరిశ్రమ శాఖలో విలీనం చేయడంతోపాటు ప్రమోషన్లు కల్పించాలని జిల్లాలోని విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమతో పాటు పనిచేస్తున్న ఇతర శాఖల్లోని అసిస్టెంట్లకు ఇప్పటికే ప్రమోషన్లు కల్పించారని పేర్కొన్నారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టుపరిశ్రమ శాఖ ఏడీ కిషోర్‌నాయక్, విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్లు నవీన్‌బాబు, రవీంద్రనాథ్, హేమచంద్ర, రమణారెడ్డి, హరిత, సునీల్ పాల్గొన్నారు.

వీధికుక్కలకు వ్యాక్సినేషన్

పలమనేరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో గతంలో తిరుపతికి వ్యాక్సినేషన్‌కు తీసుకెళ్లిన వీధికుక్కలను వ్యాక్సినేషన్ అనంతరం శుక్రవారం వాటిని పలమనేరులో మళ్లీ తీసుకు వచ్చి విడిచి పెట్టారు. అలాగే మళ్లీ రాధాబంగ్లా ప్రాంతంలోని వీధికుక్కలను తిరుపతి అనిమల్ కేర్ సిబ్బంది పట్టుకొని వాటిని వ్యాక్సినేషన్ వేసేందుకు తిరుపతికి వాహనంలో తరలించారని పలమనేరు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు.

టీఏ, డీఏలు విడుదల చేయాలి

పలమనేరు, నవంబరు29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న అంగన్వాడీ వర్కర్ల టీఏలు, డీఏలు విడుదల చేయాలని శుక్రవారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర నాయ కురాలు సరస్వతి ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. శుక్రవారం పలమనేరులో అంగన్వాడీ వర్కర్ చిలకమ్మ అధ్యక్షతన అంగన్వాడీలు సమావేశం జరిగింది. ఇందులో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల సమయంలో అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని కోరారు.

వైష్ణవీ దేవికి ప్రత్యేక పూజలు

చౌడేపల్లె, నవంబరు29:(ఆంధ్రజ్యోతి): పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బాటగంగమ్మకు విశేషపూజలు

బైరెడ్డిపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలో వున్న బాటగంగమ్మ ఆలయంలో శుక్రవారం విశేషపూజలు నిర్వహించారు. అర్చకులు నాగేంద్ర అమ్మవారికి అభిషేకం చేసి ప్రత్యేకపూజలు చేశారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

రామకుప్పం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రామకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లోకేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య సిబ్బంది పట్టణ శివార్లలోని అంబేద్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సూత్రాలు, రోగనిరోధక చర్యలపై అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ మస్తాన్‌బాషా, సూపర్‌వైజర్ భగవద్గీత, పలువురు ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

విరూపాక్షి మారెమ్మకు విశేషపూజలు

పుంగనూరు రూరల్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకున్నారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలు

పుంగనూరు రూరల్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయానికి సమీపంలో శుక్రవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. పుంగనూరు ఉబేదుల్లా కాంపౌండ్‌లో కాపురం ఉన్న మహబుబ్‌బాషా భార్య షర్మీన్(25) స్థానిక శ్రీచైతన్య టెక్నోపాఠశాలలో తన పెద్దకుమారుడిని వదిలింది. మరో కుమారుడు మహ్మద్‌సుహేల్‌తో కలిసి తిరిగి ఇంటికి బయలుదేరింది. అదే ప్రాంతానికి చెందిన జయర్ధి(14)లు ద్విచక్ర వాహనంతో ఢీకొంది. ఈ ఘటనలో జయర్ధి, షర్మీన్, ఆమె కుమారుడు మహ్మద్‌సుహేల్ గాయపడ్డారు. స్థానికులు ముగ్గురినీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బీఆర్‌డీలో నాణ్యమైన వైద్యం

శాంతిపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిచాలన్న ధ్యేయంతో శాంతిపురంలో బీఆర్‌డీ క్లీనిక్ ఏర్పాటు చేశామని ఆస్పత్రి డైరెక్టరు డా.సురేష్‌బాబు తెలిపారు. క్లీనిక్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6గంటల వరకు వైద్యసేవలు అందిస్తామని వెల్లడించారు. సీనియర్ గైనకాలజిస్ట్ హరిత ప్రతి రోజూ సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు క్లీనిక్‌లో అందుబాటులో ఉంటారని వివరించారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

క్యాన్సర్ స్క్రీనింగ్‌లో అప్రమత్తంగా ఉండాలి


జూమ్ సమావేశంలో అధికారులు

చిత్తూరు రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా క్యాన్సర్ స్క్రీనింగ్ నాణ్యతగా నిర్వహించాలని ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం విజయవాడ నుంచి ఆమె జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి టీం సభ్యులు రోజుకు ఐదు కుటుంబాలను క్షుణ్ణంగా పరీక్షించాలన్నారు. స్క్రీనింగ్ సక్రమంగా నిర్వహించకుంటే క్యాన్సర్ బాధితులు మృతికి కారణమవుతామన్నారు. అనుమానితులను వెంటనే క్యాన్సర్ ఆస్పత్రికి రెఫర్ చేయాలన్నారు. డాక్టర్ శిరీష, ఎపిడమాలజిస్ట్ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

మణిమాలన్ కుటుంబానికి సాయం

చిత్తూరు రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరి అమ్ముకుని కుటుంబాన్ని పోషిస్తున్న మణిమాలన్ కుటుంబానికి మాజీ కౌన్సిలర్ పార్థసారధి నాయుడు తన వంతు సాయమందించారు. మనిమాలన్ జీవనంపై ఆంధ్రజ్యోతిలో ప్రచురించితమైన కథనానికి ఆయన చలించిపోయారు. ఆ కుటుంబానికి కొత్త బట్టలు, దుప్పట్లు, భోజనం అందించారు. ప్రభుత్వ అధికారులు స్పందించి అవసరమైన సాయం చేయాలన్నారు.

జోనల్ కబడ్డీ పోటీల ప్రారంభం


కబడ్డీ బాలికల టీముతో టీడీపీనేతలు

గంగాధరనెల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తూగుండ్రం హైస్కూల్లో శుక్రవారం నియోజకవర్గ జోనల్ కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. టాస్ వేసి పోటీలను హెచ్.ఎం, టీచర్లు, టీడీపీనేతలు ప్రారంభించారు. సీనియర్ బాలుర విభాగంలో 10, సీనియర్ బాలికల విభాగంలో 10, జూనియర్ బాలుర విభాగంలో 9, జూనియర్ బాలికల విభాగంలో 4 టీములు పాల్గొన్నాయి. ఈకార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ముస్లిం మైనారిటీసెల్ ప్రధానకార్యదర్శి, మాజీ సర్పంచ్ నియాజ్‌అలీ, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ నరసింహులునాయుడు, శాంతకుమార్, కాణిపాకం సుధాకర్, హెచ్‌ఎం రాజేంద్రనాయుడు, ఫిజికల్ డైరక్టర్ ఉదయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో భవిష్యత్తుకు భరోసా

గంగాధరనెల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకుంటే భవిష్యత్తుకు భరసా లభిస్తుందని టీడీపీ పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు అన్నారు. బుక్కాపట్నంలో మండల టీడీపీ అధ్యక్షుడు స్వామిదాస్ అధ్యక్షతన టీడీపీ సభ్యత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సభ్యత్వం ద్వారా మంచి పథకాన్ని అమలుచేస్తున్న చంద్రబాబుకు ప్రతిఒక్కరు రుణపడి ఉంటారన్నారు. టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వెంకటేష్, శ్రీధర్‌యాదవ్, మోహన్‌నాయుడు, స్వామిదాస్, దేవసుందరం పాల్గొన్నారు.

రీసర్వే తప్పులను సరిదిద్దండి: ఆర్డీవో



పాలసముద్రం,నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రీసర్వేలో జరిగిన తప్పులను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీవో భవానీశంకరి ఆదేశించారు. శుక్రవారం ఆమె తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు,రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామ సభల్లో వచ్చిన అర్జీలపై తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో తహసీల్దార్ అరుణకుమారి, ఆర్ఐ దేవి, గణేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేడు చిత్తూరు మండల సమావేశం

చిత్తూరు రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): చిత్తూరు మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే గురజాల జగన్‌లు హాజరవుతారన్నారు. మండలాధికారులందరు తప్పక హాజరుకావాలని కోరారు.

ఇళ్ళ స్థల పట్టాలకు దరఖాస్తులు చేసుకోండి

గుడిపాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తమ అనుభవంలో ఉన్న ఇంటి స్థలాలకు ఇప్పటి వరకు పట్టాలు లేకపోతే వారు దరఖాస్తు చేసుకోవాలని తహసిల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ మండలంలో ఇళ్ళ స్థలాలు ఉండి పట్టా పొందనివారు ఆధార్, రేషన్ కార్డులతో పాటు బ్యాంకు పాస్‌బుక్‌ల నకలును దరఖాస్తుతో జతచేసి తమ కార్యాలయంలో అందజేయాలన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, మాజీ జడ్పీటీసీ బాలాజి నాయుడు, హేమాద్రినాయుడు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి ఐరాల మండల సమస్యలు


ముఖ్యమంత్రితో ఎంఎస్‌చౌదరి

ఐరాల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తమ మండలంలో సమస్యలను పరిష్కరించాలని మద్దిపట్లపల్లె మాజీ ఎంపీటీసీ ఎంఎస్‌చౌదరి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడిని కోరారు. నారావారిపల్లెలో శుక్రవారం ఆయన ముఖ్యమంతిని కలసి మండల సమస్యలను వివరించారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఎంఎస్‌చౌదరి తెలిపారు. కాణిపాకంలో నిర్మించిన వందడుగుల రోడ్డుకు నారా రామ్మూర్తి పేరు పెట్టాలని ఆయన కోరారు.

ఫ్రూట్ కవర్లతో నాణ్యమైన దిగుబడి


రైతులకు సూచనలిస్తున్న మధుసూదన్‌రెడ్డి

తవణంపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మామిడి పంటకు ఫ్రూట్ కవర్లు వాడకంతో నాణ్యమైన దిగుబడి సాధించవచ్చునని జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం అరగొండ గౌరి శంకర కల్యాణ మండపంలో మామిడి పూత, పిందె దశలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. మధుసూదన్‌రెడ్డి, శాస్త్రవేత్త రామయ్యలు మాట్లాడుతూ తేనెమంచు పురుగు నివారణకు లీటరు నీటిలో 1.5 మిల్లీ లీటర్ల బుప్రోఫైజిన్ కలిపి పిచకారి చేసుకోవాలన్నారు. ఉద్యానవన అధికారి సాగరిక, ఏవో ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వాన రోడ్ల మరమ్మతులపై నిర్లక్ష్యం తగదు

గుడిపాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రోడ్లు అధ్వానంగా ఉన్నాయని అధికారులకు తెలిసినా పట్టించుకోవడంలేదని మాజీ జడ్పీటీసీ బాలాజి నాయుడు, మండల బీజేపీ అధ్యక్షుడు ధనంజయనాయుడు, మాజీ ఎంపీపీ నాగరాజ యాదవ్‌లు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు శుక్రవారం గుడిపాలలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి రోడ్లను మరమ్మత్తులు చేపట్టడానికి నిధులు మంజూరు చేశారన్నారు. అధికారులు పాత పద్ధతిలోనే వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం చేస్తున్నారని విమర్శించారు. దీని వల్ల పార్టీకి చెడ్డ పేరు వస్తుందన్నారు.

మరుగుదొడ్ల వినియోగంపై ర్యాలీ

వెదురుకుప్పం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు శుక్రవారం మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

సబ్ స్టేషన్ తనిఖీ

చిత్తూరు రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని సంతపేట సబ్‌స్టేషన్‌ను విద్యుత్‌శాఖ ఈఈ ఇస్మాయిల్ అహ్మద్ శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించాలన్నారు. ఆయన వెంట డీఈ ప్రసాద్ ఉన్నారు.

ఈ సమస్యలను పరిష్కరించండి ప్లీజ్...


ప్రధాన మార్కెట్ వద్ద మురికినీరు

చిత్తూరు అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏడాది క్రితం ఓ కేబుల్ యాజమాన్యం నగరంలో వైర్లను పూడ్చటం కోసం రోడ్లను తవ్వి తర్వాత మట్టిని తోసి వదిలేసింది. వర్షం పడినప్పుడల్లా రోడ్లు గుంతలమయమై రాకపోకలకు ఇబ్బందిగా తయారవుతున్నాయి. 44వ సచివాలయం వీధిలో కేబుల్ అమర్చడం కోసం తవ్వి మట్టిని తోసేశారు. కాలువలా తయారవడంతో వర్షపునీటితో పాటు మురికినీరంతా అందులో చేరుతోంది.

ఏటీఎంను తెరిపించండి

గుడిపాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని ఏటీఎంను తెరిపించాలని వినియోగదారులు కోరుతున్నారు. ఐదు నెలలు క్రితం రూ.18 లక్షలు చోరీ కావడంతో ఏటీఎంను మూసేశారు. ఇక్కడ ఎక్కువ మంది లావాదేవీలు చేసేవారు. దీంతో దూరం వెళ్లాల్సి వస్తోంది. బ్యాంకు అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఐరాలలో కుక్కల బెడద



ఐరాల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కుక్కల బెడద అధిమయ్యింది. ఉదయం స్నానాలకు వెళుతున్న అయ్యప్పభక్తులపై ఇవి విరుచుకుపడుతన్నాయి. చిన్నాపెద్దా అందరూ కుక్కల బారిన పడుతుతున్నారు. ప్రజలు భయభ్రాంతులవుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌తో బెంబేలు

చిత్తూరు అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తమ ప్రాంత విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. టీవీనాయుడు వీధి కాలువపై అధికారులు గతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. బలమైన పునాది లేదు. మురికికాలువపై దిమ్మెను నిర్మించి ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చారు. కాలువలో నిత్యం మురుగు ప్రవహించడంతో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ తేమ చేరుతోంది. దీంతో ఇది నెమ్మదిగా ఒరిగిపోతోంది. ట్రాన్స్‌ఫార్మర్ పడిపోతే ప్రమాదం జరుగుతుందని స్థానికులు చెబుతున్నారు. చేతి కందే ఎత్తులోనే కరెంటు తీగలున్నాయి. విద్యుత్ అధికారులు స్పందించాల్సిన అవసరముంది.



డయింగ్ యూనిట్లపై ఏదీ పర్యవేక్షణ

● మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ల ఆగ్రహం


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ నీలమేఘం

నగరి, నవంబరు29(ఆంధ్రజ్యోతి): చేనేతకు రంగులద్దే డయింగ్ యూనిట్లపై పర్యవేక్షణ కొరవడిందని పలువురు కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నగరి మున్సిపల్ మున్సిపల్ సమావేశం చైర్మన్ నీలమేఘం అధ్యక్షతన జరిగింది. డయ్యింగ్ యూనిట్లపై పర్యవేక్షణ కొరవడటం వల్ల నీరు కాలుష్యమవుతోందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. తమిళ వ్యాపారులు ఇక్కడి యూనిట్లు బాడుగకు తీసుకుని కలుషితం చేస్తుంటే మిన్నకుండటం తగదన్నారు. కామన్ ఈటీపీకి రూ.2 కోట్ల మేర విద్యుత్ బకాయిలున్నాయన్నారు. బిల్లులు చెల్లించని యూనిట్లకు విద్యుత్ సర్వీసులను తొలగించాలన్నారు. కమిషనర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

స్మార్ట్ సెక్యూరిటీ అలారంతో చోరీలకు కళ్లెం


కాలనీ వాసులకు తాళాన్ని ఇస్తున్న సీఐ నెట్టికంఠయ్య

చిత్తూరు అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): భద్రతకోసం స్మార్ట్ సెక్యూరిటీ అలారం తాళాన్ని వినియోగించుకుని దొంగల బారి నుంచి రక్షణ పొందాలని రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య సూచించారు. శుక్రవారం ఈ అలారం వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.400 విలువ చేసే స్మార్ట్ సెక్యూరిటీ అలారం తాళాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ తాళాన్ని తాకితే అలారం శబ్దం వస్తుందని, దాంతో దొంగల పారిపోయే అవకాశం ఉందన్నారు. ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో సీసీఎల్ఏ ప్రిన్సిపల్ సెక్రటరీ


ముత్యాలరాజు,సుమిత్‌కుమార్‌లకు వేదాశీర్వచనం

ఐరాల(కాణిపాకం),నంవబరు 29(ఆంధ్రజ్యోతి): సీసీఎల్ఏ ప్రిన్సిపల్ సెక్రటరీ ముత్యాలరాజు కుటుంబ సమేతంగా శుక్రవారం కాణిపాక వరసిద్ధుని దర్శించుకున్నారు. ఆయన్ను కలెక్టర్ సుమిత్‌కుమార్, ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం ఆయన్ను వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహేష్‌కుమార్, ఎస్ఐ ధరణిధర, ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

గృహహింస, బాల్య వివాహాలపై అవగాహన


ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్‌హెచ్‌జీ మహిళలు

యాదమరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు అరికట్టి, లింగ వివక్షత, గృహహింసకు వ్యతిరేకంగా ప్రతి మహిళ నిలవాలని ఏపీఎం ఈశ్వరి కోరారు. మండలకేంద్రంలోని మహిళలకు శుక్రవారం గృహహింస, బాల్యవివాహాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు వెంకటేష్, లక్ష్మీపతి, మంజుల, మల్లీశ్వరి, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై సూచనలు


మాట్లాడుతున్న తహసీల్దార్ అరుణకుమారి

పాలసముద్రం,నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 5న సాగునీటి సంఘాల ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలని తహసీల్దార్ అరుణకుమారి సూచించారు. మండలంలో తొమ్మిది చెరువుల ఆయకట్టు సంఘాలు ఎన్నికలు నిర్వహించే సిబ్బందితో శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆమె సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధానం, కౌటింగ్ ప్రక్రియపై సూచనలు చేశారు. ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ శ్రీనివాసులు, ఇరిగేషన్ ఏఈ చీరాలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

చౌక దుకాణాలకు సరకుల విడుదల

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 5,43,202 రేషన్ కార్డులకు సంబంధించి డిసెంబరు రేషన్ కోటాను ప్రభుత్వం విడుదల చేసినట్లు సివిల్ సప్లయ్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ బాలక్రిష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కార్డుదారులకు పంపిణీ చేసేందుకు కందిపప్పు 543 టన్నులు కావాల్సివుండగా ప్రభుత్వం వెయ్యి టన్నులు సరఫరా చేసిందని చెప్పారు. అరకిలో చొప్పున పంపిణీ చేసేందుకు 291 టన్నుల పంచదార జిల్లాకు చేరుకుందన్నారు., కార్డుదారులందరికీ ఉచితంగా పంపిణీ చేసేందుకు 9030 టన్నుల బియ్యం వచ్చాయన్నారు. బియ్యంతో పాటు పంపిణీ చేసేందుకోసం 271 టన్నుల జొన్నలు జిల్లాకు చేరుకున్నాయని ఆయన పేర్కొన్నారు. జేసీ విద్యాధరి చొరవ తీసుకుని డీలర్లందరికీ అవసరమైన నిత్యవసర సరుకులను అందించారన్నారు. జిల్లాలోని 14 ఎం.ఎల్. పాయింట్ల నుంచి ఎఫ్‌పీ షాపులకు సరఫరా చేశామన్నారు. డిసెంబరు 1 నుంచి కార్డుదారులకు ఎఫ్‌పీ షాపుల నుంచి ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరఫరా చేస్తామని చెప్పారు.

రెండు డెంగ్యూ కేసుల నమోదు


డెంగ్యూ బాధిత ప్రాంతాలను పరిశీలిస్తున్న అనిల్‌కుమార్

నగరి, నవంబరు29(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతతోనే డెంగ్యూ నివారణ సాధ్యమని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. రాజీవ్‌నగర్, ఏకాంబరకుప్పం, ప్రాంతాల్లో రెండు డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ఈ ప్రాంతాల్లో నివాసాల వద్ద ప్లాస్టిక్ డ్రమ్ములు, పరిసరాలను పరిశుభ్రపరచక పోవడం డెంగ్యూ కారణంగా గుర్తించారు. ఆయన వెంట రామచంద్రారెడ్డి, శివమణి, నారాయణ, రవిచంద్రన్, తదితరులు పాల్గొన్నారు.


రేణిగుంట విమానాశ్రయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి తన కుమార్తె వివాహానికి ఆహ్వానిస్తున్న శ్రీశైలం ఆలయ ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, చిత్రంలో నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ ఉన్నారు.

రాలేని వారికి ఇంటి వద్దే రిజిస్ట్రేషన్లు చేయాలి

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్యాలయానికి రాలేని వారికి ఇంటి వద్దే రిజిస్ట్రేషన్ చేసే విధానాన్ని పునరుద్ధరించాలని జిల్లా దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘ ప్రచార కార్యదర్శి బి.కె. రూపేష్ రెడ్డి కోరారు. ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గతంలో కార్యాలయానికి రాలేని వారి ఇళ్ళకు అధికారులే వెళ్ళి రిజిస్ట్రేషన్ చేసే వారన్నారు. ప్రస్తుతం 2.0 విధానంలో ప్రైవేటు అటెండన్స్ ప్రక్రియ లేక వృద్ధులు, అనారోగ్య బాధితులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం పాత పద్ధతినే పునరుద్ధరించాలని ఆయన కోరారు.

బాల్య వివాహాల అనర్థాలపై గ్రామాల్లో అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

చిత్తూరు సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహల నిర్మూలనకు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు రియల్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామారావు తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కొవ్వొత్తుల ర్యాలీలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కార్మిక శాఖతో కలసి బాలకార్మికు విముక్తి కల్పిస్తామన్నారు. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ హనీషా, మురళిమోహన్, కరుణ శేఖర్, భువనేశ్వరి పాల్గొన్నారు.

విజయబాబుకు సన్మానం

శ్రీరంగరాజపురం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి):మండలంలోని 49. కొత్తపల్లె గ్రామ మాజీ సర్పంచ్ విజయబాబును జాతీయ కాపు సంఘం పార్లమెంటరీ అధ్యక్షుడిగా నియమించిన సందర్భంగా శుక్రవారం ఎస్ఆర్‌పురం ఎంపీపీ తంగ్రి జనార్దన్ శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాబు, ఉమాపతి, ఆనంద్, మహేష్, కాలప్ప, గండుమణి, బాబు, జయపాల్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు సాయం

వెదురుకుప్పం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేటకు చెందిన టీడీపీ కార్యకర్త దాము(55) కాలికి శస్త్రచికిత్స జరగడంతో శుక్రవారం టీడీపీ నాయకులు పరామర్శించారు. ఆయనకు రూ.11వేలు మండల టీడీపీ అధ్యక్షుడు చెంగల్రాయయాదవ్ అందజేశారు.

ఎస్‌టీయూ నిరసన

నగరి, నవంబరు29(ఆంధ్రజ్యోతి): టీచర్లను ఒత్తిడికి గురి చేస్తున్న శిక్షణా తరగతులను రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన నిరసనలో ఆయన మాట్లాదుగూ వేసవి సెలవుల్లో నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణా తరగతులు నిర్వహించాలన్నారు.

ఘనంగా ఏకదిన బిల్వార్చన

చిత్తూరు కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర ఆలయంలో శుక్రవారం స్వామి అమ్మవార్లకు రెండు కాలాల ఏకదిన బిల్వార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం, సాయంత్రం భక్తులు బిల్వపత్రాలతో అభిషేకం, అర్చన నిర్వహించారు.

పాలసముద్రం డీటీగా రిషివర్మ

పాలసముద్రం,నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల డీటీగా రిషివర్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కుప్పం ఆర్డీవో కార్యాలయం నుంచి డిప్యూటేషన్‌పై వచ్చారు. ఇక్కడి డీటీ నాగరాజు బదిలీపై కార్వేటినగరం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వెళ్లారు. రిషివర్మను కార్యాలయ సిబ్బంది సన్మానించారు.

జంబువారిపల్లెలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

బంగారుపాళ్యం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దండువారిపల్లెకు చెందిన ఆదర్శ రైతు జగదీష్ రెడ్డి రూ.లక్షతో జంబువారిపల్లె దళితవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీనిని ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దాత జగదీష్ రెడ్డిని గ్రామస్థులు సన్మానించారు. కార్యక్రమంలో చుట్టుప్రక్కల గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.